క్లుప్తంగా

ఈజీఎస్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి



ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న ఉద్యోగులు

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలో సెర్ప్ ఉద్యోగుల మాదిరిగానే ఈజీఎస్ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించేలా ప్రభుత్వంతో మాట్లాడాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని ఈజీఎస్ జేఏసీ నాయకులు వెంకటేశ్, రమేశ్‌బాబు కోరారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఈజీఎస్ కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పే స్కేల్, వర్తింపజేసేలా చూడాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. రాష్ట్రంలో 3874 మంది ఉద్యోగులుండగా, జిల్లాలో 67మంది ఉన్నారని పేర్కొన్నారు. నాయకులు దివ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

జూలపల్లి: గ్రామాల్లో సీసీరోడ్లను నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి అన్నారు. మండలంలోని పెద్దాపూర్ లో రూ.5 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీరోడ్డుకు సర్పంచ్ కంకణాల భారతితో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో పూర్తి స్థాయిలో సీసీరోడ్లు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాలరావు, ఉపసర్పంచ్ శ్రీనివాస్, జ్యోతిబసు, వార్డు సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

టీబీ బాధితులు పౌష్టికాహారం తీసుకోవాలి



పౌష్టికాహారం అందిస్తున్న దాతలు

జూలపల్లి: టీబీ వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి అన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సబ్‌సెంటర్లకు చెందిన పదిమంది టీబీ రోగులకు నిక్షయ్‌మిత్ర లో దాతలు బోడ రవికాంత్‌రెడ్డి, బొమ్మకంటి రవికిరణ్ సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాధి నివారణకు క్రమం తప్పకుండా మందులు వాడాలని, టీబీని పూర్తి గా నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో టీబీ ప్రోగ్రాం అధికారి వైద్యాధికారి సంపత్‌రెడ్డి, జిల్లా టీబీ కో ఆర్డినేటర్ వీరగోని శ్రీనివాస్, సీహెచ్‌వో కలీమొద్దీన్, ఎస్‌టీఎస్ సురేందర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేయాలి



ఎన్నికైన వారిని అభినందిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: బీఆర్‌ఎస్ బలోపేతానికి యువత కృషి చేయాలని యూత్ పట్టణ అధ్యక్షుడు ఎండీ వాహిద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పూసాలలో 14వ వార్డు కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో యూత్ కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మధుకర్ ఉపాధ్యక్షుడిగా సతీశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అంజి, కమలాకర్, కిరణ్, రాకేశ్, శ్రీకాంత్, ప్రశాంత్ , తదితరులు పాల్గొన్నారు

క్రీడాకారులకు సామగ్రి అందజేత

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు సర్పంచ్ సుజాత–రమేశ్ దంపతులు మంగళవారం రూ.12 వేల విలువ గల క్రీడా సామగ్రిని అందించారు. క్రీడాకారులు ఆటల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పులి అనూష, ఉపసర్పంచ్ మధు, కార్యదర్శి ప్రశాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు రోడ్డుతో ఎన్నాళ్లీ అవస్థలు?

- గుంతలమయంగా మల్కాపూర్ రోడ్డు
- నిత్యం రద్దీగా రహదారి
- ఇబ్బంది పడుతున్న ప్రజలు వాహనదారులు



రెండు వాహనాలు ఒకేసారి వెళ్లని సింగిల్ రోడ్డు



ఇరుకుగా ఉన్న మల్కాపూర్ రోడ్డు

జ్యోతినగర్: రామగుండం నగర పరిస్థితి చూస్తుంటే డివిజన్‌కో సమస్య.. రోడ్డుకో గుంత అన్నట్లు వుంది. కార్పొరేషన్ ఐదో డివిజన్‌లోని మల్కాపూర్ ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయమై ఇరుకుగా మారి ప్రజల, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో రోడ్డుపై ఉన్న గుంతలో వాహనాలు పడిపోయి ప్రమాదాలకు గురైన వారు చాలా మంది ఉంటారు. ఎనిమిదేళ్ల క్రితం నిర్మించిన రోడ్డు ప్రస్తుతం గుంతలమయంగా మారిపోయింది. ఎన్టీపీసీ సంస్థలో రక్షణ విధులు నిర్వహించే సీఐఎస్ఎఫ్ బ్యారెక్స్, శ్రీనగర్‌కాలనీ, మల్కాపూర్, కళాశాలకు వెళ్లే మార్గంతో పాటు ఓపెన్‌కాస్ట్–4 రోడ్డుకు అనుసంధానంగా ఉన్న రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది.

రోడ్డు నిర్మాణానికి.. బూడిద పైప్‌లైన్‌కు లింక్

ఎన్టీపీసీ రామగుండం పునరావాస ప్రాంతాలుగా ఉన్న క్రమంలో సామాజిక సేవా బాధ్యతా పథకం (సీఎస్సార్) ద్వారా రోడ్డు నిర్మాణానికి నిధులను సైతం కేటాయించారు. మల్కాపూర్ రోడ్డు మార్గంలో ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టుకు సంబంధించిన బూడిద పైప్‌లైన్ ఓసీపీ–4 వరకు బూడిదను తరలించేందుకు పైప్‌లైన్ నిర్మించేందుకు ప్రణాళికలు సైతం సిద్ధం చేశారు. స్థలాన్ని సైతం సంస్థ సేకరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజలు కూడా రోడ్డు నిర్మించాలని ఆందోళనలు కూడా చేపట్టారు. మల్కాపూర్ రోడ్డును ఎన్టీపీసీ వారు నిర్మిస్తున్నారని, బూడిద పైపులైన్‌కు అవసరమైన స్థలాలు ఇవ్వాలని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. పాలకులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని మల్కాపూర్ రోడ్డుకు బూడిద పైపులైన్‌కు ఉన్న లింక్‌ను పక్కకు పెట్టి రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు నిర్మించాలి



రాజీవ్ రహదారిని ఆనుకుని ఉన్న మల్కాపూర్ రోడ్డును వెడల్పు చేయడంతో పాటు కొత్త రోడ్డును వెంటనే నిర్మించాలి. గుంతలతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. సీఐఎస్ఎఫ్ సిబ్బంది బస్సులు, ప్రైవేట్ కాలేజీ బస్సులు రోజు వెళతాయి. రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఇబ్బంది పడుతున్నాం. మాకు కొత్త రోడ్డును నిర్మించాలి.

–ప్రభాకర్‌రావు,శ్రీనగర్‌కాలనీ

రోడ్డుకు.. పైప్‌లైన్‌కు లింకేంటి?



ప్రజలకు ఇబ్బందులను తొలగించేందుకు నిర్మించాల్సిన రోడ్డుకు బూడిద పైపులైన్‌కు లింకేంటి అనేది మాకు అర్థం కావడం లేదు. ప్రజల అవసరాలను గుర్తెరిగి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. సమస్యల పరిష్కారంలో చొరవ చూపించి అభివృద్ధి సాధించాలి.

– శ్రీనివాస్, శ్రీనగర్‌కాలనీ, రామగుండం కార్పొరేషన్

ఆడబిడ్డలకు వరం 'కల్యాణలక్ష్మి'

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఓదెల: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి ఆడబిడ్డలకు వరంలాంటిదని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఓదెల మండల పరిషత్‌లో 57మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. దేశంలో ఎక్కడలేని విధంగా ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకంకు మంచి పేరొచ్చిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె రమేశ్, ఆర్‌ఐ బండ రాజేందర్, ఎంపీపీ కునారపు రేణుకదేవి, సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి, రైతు సమన్వయసమితి మండల చైర్మన్ కావటి రాజు, ఎంపీటీసీ చిన్నస్వామి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతోమానసికోల్లాసం

క్రీడలతో యువకులకు మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కేసీఆర్ జన్మదినం సందర్భంగా క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఆటల్లో గెలుపోటములు సర్వసాధారణమన్నారు. మండలంలోని గూడెం గ్రామంలో ఇటీవల వీరముష్టి సంపత్ విద్యుత్ షాక్‌తో మృతి చెందగా, మృతుడి భార్య స్వప్నకు మంజూరైన రూ.5 లక్షల రైతు బీమా చెక్కును పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మంగళవారం అందజేశారు.

క్రీడల్లో యువత రాణించాలి

జూలపల్లి: క్రీడల్లో గ్రామీణ యువత క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 17 సీఎం జన్మదినాన్ని పురస్కరించుకుని కుమ్మరికుంటలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోశ్‌రావు,ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి,ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశ్, వైస్ ఎంపీపీ రమేశ్, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లకు దరఖాస్తులు ఆహ్వానం

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లకు అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల తహసీల్దార్ అనుపమరావు తెలిపారు. నేటినుంచి 10వతేదీ శుక్రవారం ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పేర్కొన్నారు. 240 యూనిట్లలో 50 యూనిట్లు గతంలో లబ్ధిదారులకు కేటాయించినట్లు మిగిలిన 190 యూనిట్లకు మండలంలోని 24 గ్రామాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం, మైనార్టీలకు 7 శాతం, 43 శాతం ఇతరులకు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

రామగుండం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రామగుండం, అంతర్గాం మండలాల పరిధిలోని అర్హులై ఉండీ ఇళ్లు లేని నిరుపేదలు డబుల్ బెడ్ రూం కోసం మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం రెండు మండలాల తహసీల్దార్లు జాహెద్‌పాషా, కత్రోజు వేణుగోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే వారు ఫోటో, ఆధార్‌కార్డు, ఆహార భద్రతా కార్డు, కులం, ఆదాయ ధృవీకరణపత్రాలు, ఆర్జీదారు బ్యాంకు వివరాలు, ఓటర్ గుర్తింపు కార్డు, మొబైల్ నెంబర్ తప్పనిసరిగా దరఖాస్తుతో జిరాక్స్ కాపీలను జతపరచాలని పేర్కొన్నారు.

బీఎస్పీ రిలే దీక్షలకు సీఐటీయూ మద్దతు



రిలే దీక్ష శిబిరాన్ని సందర్శించిన నాయకులు

పెద్దపల్లిరూరల్: బీసీ గణన చేపట్టాలని, బీసీ రిజర్వేషన్లు వర్తింపజేయాలంటూ బీఎస్పీ ఆధ్వర్యంలో 13 రోజులుగా కొనసాగుతున్న రిలే దీక్షలకు సీఐటీయూ నాయకులు సంఘీభావం ప్రకటించారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉషతో కలిసి మంగళవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు చేయడం ద్వారానే ఒత్తిడి పెంచగలుగుతామన్నారు. అణగారిన వర్గాలకు 75 ఏళ్లుగా అన్యాయమే జరుగుతోందన్నారు. ప్రభుత్వరంగంలోనే కాకుండా ప్రైవేట్ రంగాల్లోనూ రిజర్వేషన్లు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. నాయకులు జ్యోతి, అంజయ్య, వెంకటస్వామి, ఖాజా, సవిత, వెంకటేశ్, శేషాద్రి, రియాజ్, మధు, అరుణ పాల్గొన్నారు.

వ్యాయామం ప్రతి ఒక్కరికీ అవసరం

సుల్తానాబాద్: ప్రతి ఒక్కరూ తప్పకుండా వ్యాయామం చేయాలని శ్రీవాణి కళాశాలల డైరెక్టర్ రేకులపల్లి సుష్మ అన్నారు. మంగళవారం సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీవాణి డిగ్రీ పీజీ కళాశాలలో ఫిజికల్ ఫిట్‌నెస్ ట్రైనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో లైఫ్ స్టైల్ డిసీజెస్ పై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరికి ఏదో ఒక జబ్బు ఉంటుందని, వాటిని అదుపులో ఉంచుకునేందుకు నిత్యం తప్పనిసరిగా వ్యాయమం చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక ,ప్రిన్సిపాల్స్ బండారి కమలాకర్,బాలసాని శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి



శిబిరాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్

యైటింక్లయిన్‌కాలనీ: కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని రామగుండం మున్సిపల్ అడిషనల్ కమిషనర్ నారాయణ రావు అన్నారు. మంగళవారం యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ అల్లూరు ప్రభుత్వ పాఠశాలలో డివిజన్ కార్పొరేటర్ అంజలీదేవితో కలసి కంటివెలుగు ప్రారంభించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బాదె అంజలిదేవి, అల్లూరు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ నీలిమ, హెల్త్ సూపర్ వైజర్ సీతారామయ్య, శానిటరి సూపర్ వైజర్, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో కంటి వెలుగు

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు కీచులాటపల్లెలో కంటి వెలుగు చేపట్టారు. జూలపల్లిలో 130 మందికి పరీక్షలు చేసి 26 మందికి అద్దాలు పంపిణీ చేయగా, కీచులాటపల్లెలో 141 మందికి పరీక్షలు చేసి 34 మందికి అద్దాలు అందజేశారు. కార్యక్రమాల్లో మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి, సీహెచ్‌వో, ప్రోగ్రాం అధికారి కలిమొద్దీన్, వైద్యులు,ఏఎన్ఎంలు,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కరాటే విజేతలకు అభినందన

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లికి చెందిన విద్యార్థులు జాతీయస్థాయి అండర్–12 కరాటే పోటీల్లో స్మార్ట్ కిడ్జ్ విద్యార్థులు లోకేశ్, అమృతేశ్వర్ ప్రతిభను కనబర్చి విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా మంగళవారం అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో మంచి ప్రతిభా నైపుణ్యాలను ప్రదర్శించి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించా రు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శైలజ, రామకృష్ణ, క రాటే మాస్టర్ లక్ష్మీనర్సయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీఏ జీఎంకు సన్మానం

రామగిరి: సింగరేణి సంస్థ ఏపీఏ జీఎంగా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన కె. వెంకటేశ్వర్లును మంగళవారం సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్టీయూ)నాయకులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ కార్మికులు సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న, ఆర్జీ–3 డివిజన్ కార్యదర్శి సుద్దాల మనోజ్, నాయకులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

మంథని: మైనార్టీ కార్పొరేషన్ వ్యక్తిగత యూనిట్ల కోసం దరఖాస్తు చేస్తున్న అభ్యర్థులకు నేడు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

క్రీడాకారులు స్నేహభావంతో మెలగాలి

కాల్వశ్రీరాంపూర్: క్రీడాకారులు స్నేహభావంతో మెలగాలని, గెలుపోటములు సమానంగా తీసుకోవాలని ఎస్సై రాజవర్ధన్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి అన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం సీఎం కేసీఆర్ క్రికెట్‌కప్ టోర్నమెంట్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆడెపు శ్రీదేవి రాజు, వైస్ ఎంపీపీ జూకంటి శిరీష అనిల్, ఎంపీటీసీ మాదాసు సువర్ణ, నాయకులు చదువు రాంచంద్రా రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, క్రీడాకారులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతు



మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సుల్తానాబాద్: పట్టణంలో పైప్ లైన్ లీకేజీలు కాకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత గౌడ్ అన్నారు. మంగళవారం సల్తానాబాద్ పట్టణంలో పైప్ లైన్ లీకేజీల మున్సిపల్ సిబ్బందితో మరమ్మతులు పూర్తి చేసి నీటిని సరఫరా చేసినట్లు తెలిపారు. పైప్‌లైన్ల లీకేజీతో సమస్యలు ఉత్పన్నమవుతాయని, లీకేజీ అయితే వెంటనే మున్సిపల్ కార్యాలయంలో సమాచారం అందించాలని కోరారు. ఆమె వెంట పలువురు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనంబులాద్రి రథోత్సవం



రథానికి పూజలు చేస్తున్న నాయకులు

సుల్తానాబాద్‌రూరల్: శ్రీలక్ష్మీనంబులాద్రి స్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఫిబ్రవరి 1న స్వామివారి తీరుకల్యాణంతో ప్రారంభమైన స్వామివారి బ్రహ్మోత్సవాలు, జాతర మంగళవారం రథోత్సవంతో ముగిశాయి. ఈ సందర్భంగా జాతరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా, ఇతర రాష్ట్రాల నుంచి భారీగా జనం తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలాజీరావు, సర్పంచ్‌లు కొమల, సాగర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ దేవరనేని మోహన్‌రావు, అర్చకులు పాల్గొన్నారు.

మల్లన్నసన్నిధిలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

ఓదెల: జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రధాన అర్చకులు వీరభద్రయ్య, భవనేశ్వరయ్య, జ్ఞానేశ్వరశాస్త్రి ఆధ్వర్యంలో బిలయాత్ర గోపూజ, గణపతి పూజ, రక్షా బంధనము, ధ్వజారోహణము, అఖండ దీపారాధన, అగ్నిప్రతిష్ఠ, హారతి మంత్ర పుష్పము తీర్థప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మేకల మల్లేశం యాదవ్, పాలకవర్గ సభ్యులు, ఈవో బొడ్క సదయ్య,సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ఫీర్ పహాడ్ దర్గా ఉర్సు ఉత్సవాలు



గంధం తీసుకువస్తున్న ఉర్సు నిర్వాహకులు

రామగిరి: మండలంలోని బేగంపేట శివారులోని ఫీర్‌పహాడ్ గుట్టపై దర్గా ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఫీర్‌పహాడ్ దర్గా ఉర్సు ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులు తీసుకువచ్చిన సందల్(గంధం)బేగంపేటకు చెందిన ఉర్సు నిర్వాహకుల ఇంటి నుంచి సోమవారం రాత్రి డప్పు చప్పుల మధ్య గుట్టపైన ఉన్న ఫీర్‌పహాడ్‌కు తీసుకువచ్చారు. రాత్రి తీసుకువచ్చిన సంధల్‌ను తాకుతూ భక్తుల పరవశించిపోయారు. గంధం గుట్ట పైన చేరిన తరువాత ఉర్సు జాతర జోరుగా సాగింది. భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధు శైలజ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

'ఎమ్మెల్యేపై ఆరోపణలు అర్థరహితం'

రామగుండం: పెద్దంపేట కుర్సుకమ్మి భూముల విషయమై కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌పై చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని మరోసారి ఇలాంటి చవకబారు ఆరోపణలు చేస్తే సహించేది లేదని అంతర్గాం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బానోతు తిరుపతినాయక్ హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం అంతర్గాంలో మాట్లాడారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే కుర్సుకమ్మి భూముల సమస్య ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొంటుండగా కేంద్రంలో, రాష్ట్రంలో 50 ఏళ్ల అధికారంలో ఉండీ సమస్యను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో అనవసర ఆరోపణలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలను కోవడం అవివేకమన్నారు. సమావేశంలో మండల వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు దివాకర్, నాయకులు నూకరాజు, సర్పంచులు పాల్గొన్నారు.

'జోడో యాత్ర కాదు బాధించే యాత్ర'

గోదావరిఖని: దశాబ్దాలుగా తెలంగాణ ప్రజల్ని పీడించిన కాంగ్రెస్ చరిత్రను మరచి ప్రజల్ని మభ్య పెట్టడానికి, వంచించడానికి యాత్రల పేరుతో ప్రజల్లోకి వస్తున్నారని బీఆర్ఎస్ అధికార ప్రతినిధులు పర్లపల్లి రవి, నారాయణ దాసు మారుతి ఒక ప్రకటనలో విమర్శించారు. అధికారంలోకి రావడం అసాధ్యంగా భావించి ప్రభుత్వాన్ని బదనాం చేయడానికి అనేక రకాల తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పుడు ఓసీపీ–5 పేరుతో ప్రజల్ని రెచ్చగొట్టే చర్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే చందర్‌ను విమర్శిస్తే ఊరుకోబోమన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు ఖాళీ క్వార్టర్లు కేటాయించాలి

గోదావరిఖని: సింగరేణిలో ఖాళీగా ఉన్న క్వార్టర్లను కాంట్రాక్టు కార్మికులకు కేటాయించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో మాట్లాడారు. వేలాదిమంది కాంట్రాక్టు కార్మికులు సంస్థలో పనిచేస్తున్నారని, చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీతంలో ఎక్కువ భాగం ఇంటి అద్దెలకే సరిపోతుందన్నారు. ఇసింగరేణి వ్యాప్తంగా సుమారు 20 వేలకు పైగా క్వార్టర్లు ఖాళీగా ఉన్నాయని, వాటిని కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వడం వల్ల యాజమాన్యానికి ఏమి నష్టం వస్తుందని ప్రశ్నించారు. ప్రతి కాంట్రాక్టు కార్మికుడికి 7వ తేదీలోగా జీతం కూడా చెల్లించాలన్నారు. 2019 నుండి రావాల్సిన సీఎంపీఎఫ్ చిట్టీలను వెంటనే పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కోశాధికారి వేల్పుల కుమారస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్రగాని కృష్ణయ్య, కార్యదర్శులు ఉపేందర్, దూలం శ్రీనివాస్, గద్దల శ్రీనివాస్, అంబాల ఓదెలు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

శోభాయాత్ర అడ్డుకోవడమెందుకు..?

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్ ఆవరణలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తలపెట్టిన శోభాయాత్రను పోలీసులు అడ్డుకుని హిందువుల మనోభావాలను దెబ్బతీశారని బీజేపీ నాయకుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లిలో మంగళవారం మాట్లాడారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు పోలీసులు తొత్తులుగా వ్యవహరిస్తూ అత్యుత్సాహాన్ని ప్రదర్శించి శోభాయాత్రకు ఆటంకం కలిగించడాన్ని ఖండించారు. పోలీసుల సూచనల మేరకే యాత్రను ప్రశాంతంగా నిర్వహించుకుంటుండగా అడ్డుకోవడం సరికాదన్నారు. ఇక ముందు ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలన్నారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయండి

మంథని: పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే డిమాండ్ ఈ నెల 9న హైదరాబాద్‌లోని సుందరయ్య పార్కు వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు కోరారు. మంగళవారం మంథనిలో ప్రజా సంఘాల పోరాట సమితి ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. చలో హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేశ్, ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.

మన ఊరు మనబడి పనులు పరిశీలన

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలో మోడల్ పాఠశాలలుగా మన ఊరు..మన బడి కార్యక్రమం కింద ఎంపికైన బ్రాహ్మణపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల లో సాగుతున్న పనులను మంగళవారం అధికారులు పరిశీలించారు. నిర్మాణపనులు పూర్తయ్యాయని, గ్రౌండ్‌లో మొరం పోయించి చదును చేయించే పనులు సాగుతున్నాయని ఎంపీవో సుదర్శన్ తెలిపారు.

నూతన నియామకం

సుల్తానాబాద్: టాటా మ్యాజిక్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా మహమ్మద్ రఫీక్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా శంకరయ్య, సునీల్, ప్రధాన కార్యదర్శిగా సంజీవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంజీవ్, శంకరయ్య, శ్రీనివాస్, హనుమంతు, సురేశ్, సతీశ్, రవీందర్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ నియామకం

రామగిరి: ముత్తారం మండలం పారుపల్లి గ్రామ కాంగ్రెస్ కమిటీని మంగళవారం నియమించారు. అధ్యక్షుడిగా కోట ఎల్లయ్య, ఉపాధ్యక్షులుగా అంబటి చంద్రమౌళి, ఇనుముల సదయ్య, కలవేన గట్టయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎడవేన కమలాకర్, కోశాధికారిగా గోస్కి సంపత్, ప్రచార కార్యదర్శిగా బోడ బాపు గౌడ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా పర్శ కిషోర్, బీసీ సెల్ అధ్యక్షుడిగా బోడ శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఇనుముల ప్రదీప్, కిసాన్ సెల్ అధ్యక్షుడిగా కలవేన తిరుపతి, సోషల్ మీడియా ఇంచార్జిగా కోట రమాకాంత్‌ను నియమించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శివకుమార్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఎడవేన సంపత్, నాయకులు మద్దెల రాజయ్య,వాజీద్ పాషా, సోషల్ మీడియా ఇన్‌చార్జి కోల విజయ్, తదితరులు పాల్గొన్నారు.